
ఉద్యానం.. అధ్వానం



శిథిలమైన కళావేదిక..



తుప్పుపట్టి, రంధ్రాలుపడిన కళావేదిక పైకప్పు..

- విశాలాక్షినగర్‌లోని రెవెన్యూ పార్కుపై నిర్లక్ష్యం
- మౌలిక సదుపాయాలు దూరం
- ఆహ్లాదం కరువు
- తుప్పుపట్టిన ఆట పరికరాలు



విశాలాక్షినగర్‌లో రెవెన్యూ పార్కు..



పనిచేయని వాటర్ ఫౌంటెన్

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లోని రెవెన్యూ పార్కు అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. ఒకప్పుడు సాంస్కృతిక కార్యకలాపాలతో కళకళలాడిన ఈ పార్కు ప్రస్తుతం శిథిలావస్థకు చేరి, తన ఉనికిని కోల్పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారుల కోసం ఏర్పాటు చేసిన ఈ కాలనీ లేఅవుట్‌లో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పార్కు గతంలో వాకర్స్ కోసం ఫుట్‌పాత్‌లు, సేదదీరడానికి ఇనుప బెంచీలు, పిల్లల ఆట పరికరాలతో సందడిగా ఉండేది. ప్రస్తుతం ఇవన్నీ తుప్పుపట్టి, విరిగిపోయి శిథిలావస్థకు చేరాయి. నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే విశాలమైన కళావేదిక పైకప్పు తుప్పుపట్టి రంధ్రాలు పడింది. వేదిక గోడలు, ప్లాట్‌ఫాం పెచ్చులు ఊడిపోయాయి. ఒకప్పుడు ఆదాయాన్ని కూడా సమకూర్చిన ఈ వేదిక ఇప్పుడు నిరుపయోగంగా మారింది. పార్కు మధ్యలో ఆకర్షణగా నిలిచిన వాటర్ ఫౌంటెన్ పనిచేయడం లేదు. రంగు రంగుల నీరు, సంగీతం మాయమయ్యాయి.

అభివృద్ధి పనులకు గ్రహణం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టారు. నాటి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, గత మేయర్ గొలగాని హరి వెంకట కుమారి సుమారు రూ.2 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే 2024 ఏప్రిల్‌లో జరిగిన సాధారణ ఎన్నికలు, కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఆ శంకుస్థాపనకు గ్రహణం పట్టిందని స్థానికులు విమర్శిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు జోక్యంతోనే పనులు నిలిచిపోయాయని, అందుకే జీవీఎంసీ అధికారులు కూడా అభివృద్ధి పనులు చేపట్టడం లేదని వారు ఆరోపిస్తున్నారు. పార్కును అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకురావాలని, పిల్లలకు, పెద్దలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని విశాలాక్షినగర్ వాసులు జీవీఎంసీ అధికారులను కోరుతున్నారు.

చెత్త కుప్పలు, పిచ్చి మొక్కల మధ్య ఆట పరికరాలు

పిల్లల పార్కులో ఆట పరికరాల మధ్యే చెత్త కుప్పలు పేరుకుపోయాయి. పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి, పాములు చేరే ప్రమాదం ఉండటంతో పిల్లలు ఆడుకోవడానికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. చెత్త కుప్పల నుంచి వచ్చే దుర్వాసనతో పరిసరాలు అధ్వానంగా మారాయి.



చెత్త కుప్పలు, పిచ్చి మొక్కల మధ్య ఆట పరికరాలు

అధికారుల నిర్లక్ష్యం తగదు

ఈ పార్కుపై జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. సుమారు నాలుగేళ్లుగా ఇందులో ఆట పరికరాలు, కూర్చొనే బెంచీలు, వాటర్ ఫౌంటెన్ పాడయ్యాయి. అందంగా కనిపించే పచ్చని లేన్లు ఇప్పుడు పూర్తిగా లేవు. నగరంలో పలుచోట్ల కొత్త పార్కులు నిర్మిస్తున్న అధికారులు జనావాసాలలో ఇంత విశాలమైన పార్కును పట్టించుకోకుండా వదిలేయడం తగదు.

–ఎస్.శ్రీనివాసరావు, విశాలాక్షినగర్

పార్కును అభివృద్ధి చేయాలి

విశాలాక్షినగర్‌లో ఇది విశాలమైన పార్కు. ఉదయం, సాయంత్రం సమయాల్లో వందల మంది వాకర్స్, ఆడుకోవడానికి వచ్చే పిల్లలతో సందడిగా ఉండేది. ఇప్పుడు ఈ పార్కులో సౌకర్యాలు లేకపోవడంతో ఇవ్వరూ వెళ్లడం లేదు. అధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తోంది. మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలి.

–రాజా, విశాలాక్షినగర్

కళావేదిక అందుబాటులోకి తేవాలి

ఇక్కడ కళావేదికపై పుట్టినరోజు వేడుకలు జరుపుకొనేవారు. సాయంత్రం సమయంలో ఆధ్యాత్మిక ఉత్సవాలు జరుపుతుండేవారు. ఇప్పుడు ఈ కళావేదిక శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు ఎప్పుడు కూలిపోతుందోననే భయంగా ఉంది. అందుకే దీనిలో కార్యక్రమాలు చేయడం మానేశారు. అధికారులు ఈ పార్కులో అభివృద్ధి పనులు చేపట్టాలి.

–ఆర్.కృష్ణారావు, విశాలాక్షినగర్

క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌ల పంపిణీ



బ్యాగులు, యూనిఫాంలతో విద్యార్థులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–9లోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం పుస్తకాలు, బ్యాగులు అందజేశారు. పాఠశాలలు తిరిగి తెరుచుకున్న నేపథ్యంలో, ప్రభుత్వం నుంచి సరఫరా చేసిన విద్యా సామాగ్రిని హెచ్‌ఎం సిద్దార్థ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ, పాఠశాలలో ఉన్న 60 మంది విద్యార్థులకు ప్రభుత్వం అందించిన యూనిఫామ్స్, బ్యాగులు, ఇతర వస్తువులను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

19వ వార్డులో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

ఎంవీపీకాలనీ: 19వ వార్డు పెదజాలరిపేటలోని అంగన్‌వాడీ సెంటర్లలో కొత్తగా చేరిన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం పెదజాలరిపేట జీవీఎంసీ స్కూల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. సామూహిక అక్షరాభ్యాసంతో పాటు ఐదేళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సీడీపీఓ నీలిమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్తి స్నేహపూర్వక వాతావరణంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు విద్యను అందించాలని సూచించారు. పౌష్టికాహారం అందిస్తూ వారి ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుందరి, స్కూల్ హెచ్‌ఎం విష్ణుమూర్తినాయుడు, స్థానిక కార్పొరేటర్ నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి వార్షిక అభిషేకం



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న అంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వార్షిక అభిషేక వేడుక వైభవంగా జరిగింది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని మూలవిరాట్ శ్రీవల్లి, దేవసేన సహిత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, ఏకవారాభిషేకం నిర్వహించారు. వీటితో పాటు మండపారాధన, పంచామృతాభిషేకం అత్యంత శోభాయమానంగా జరిగాయి. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఈస్ట్‌కోస్ట్‌రైల్వే మజ్దూర్ సంఘ్ డివిజన్ నూతన కమిటీ



కమిటీ సభ్యులను అభినందిస్తున్న యూనియన్ జనరల్ సెక్రటరీ త్రిలోచన్ సాహూ, బీఎంఎస్ స్టేట్ సెక్రటరీ ఎంవీఎస్

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్‌రైల్వే మజ్దూర్ సంఘ్, వాల్తేర్ డివిజన్ నూతన డివిజనల్ కమిటీ నియామకాలు ఇటీవల భువనేశ్వర్‌లో ఏకగ్రీవంగా జరిగాయి. డివిజనల్ ప్రెసిడెంట్‌గా సారిపాక శ్రీనివాస్, సెక్రటరీగా వాల్తేర్ డివిజన్, క్యారేజ్ అండ్ వేగన్ విభాగం గ్రేడ్–1 టెక్నీషియన్ డాక్టర్ వి. రవికిరణ్, ట్రెజరర్‌గా జి. బాలమురళీ కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు వివిధ కమిటీ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. నూతన కమిటీ నియామకం ఈస్ట్‌కోస్ట్‌రైల్వే మజ్దూర్ సంఘ్ జనరల్ సెక్రటరీ త్రిలోచన్ సాహూ, బీఎంఎస్ స్టేట్ సెక్రటరీ ఎంవీఎస్ నాయుడుల నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను వారు అభినందించారు.

కూటమి ఏడాది పాలనంతా మోసమే



పుస్తకాన్ని ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నడింపల్లి కృష్ణంరాజు కార్యకర్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురంలో మంగళవారం 'జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ప్రదర్శించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్, 15వ వార్డు ఇన్‌చార్జి నడింపల్లి కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 15వ వార్డులో ఈ పుస్తకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఈ ప్రదర్శన నిర్వహించినట్లు కృష్ణంరాజు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, సూపర్ సిక్స్ పథకాలు ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు బుగత యేసురత్నం, కణితి మరియదాస్, కే. వెంకట్రావు, వేగి వెంకట్రావు, పెదిరెడ్ల నూకరాజు, మారడబుడి వేలంగాని, బి. భాస్కర రావు, కణితి రాజు, జనార్ధనమ్మ, అ. మహాలక్ష్మి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

18వ వార్డులో..

ఎంవీపీకాలనీ: పేదల సంక్షేమమే లక్ష్యంగా ఐదేళ్ల పాటు సేవలు అందించిన మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచి ఉంటారని 18వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమ్మిడి కల్యాణ్ అన్నారు. మంగళవారం 18వ వార్డు ఎంవీపీ కాలనీ సెక్టార్–9లో పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో 'జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కల్యాణ్ మాట్లాడుతూ, కేవలం ఏడాది పాలనలోనే కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని విమర్శించారు. అబద్ధాలు, మోసపూరిత హామీలతో ఎన్నికల్లో గెలిచిన కూటమి ప్రభుత్వం పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పేర్ల విజయచందర్, రమణమూర్తి, మరుపల్లి పరదేశి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

28వ వార్డులో అన్నదానం

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు పందిమెట్టలోని శ్రీ ముత్యాలమ్మ తల్లి మహోత్సవంలో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన మహా అన్నదానానికి భక్తులు తరలివచ్చారు. వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పల్లా దుర్గారావు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

ఎంవీపీ కాలనీ రైతు బజార్‌లో రైపెనింగ్ చాంబర్



రైపెనింగ్ చాంబర్‌లో నిల్వచేసిన అరటి పండ్లు

ఎంవీపీకాలనీ : ఎంవీపీ కాలనీ రైతు బజార్‌లో పండ్లు నిల్వ చేసే రైపెనింగ్ చాంబర్ (పండ్లు మగ్గపెట్టే గోదాం) రైతులకు తిరిగి అందుబాటులోకి వచ్చింది. కొన్నేళ్లగా మూతపడి ఉన్న ఈ చాంబర్‌ను జిల్లా వాణిజ్య మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో మరమ్మతులు నిర్వహించి రైతుల వినియోగానికి సిద్ధం చేశారు. మరమ్మతులు ఇటీవల పూర్తి కావడంతో మంగళవారం నుంచే రైతులు ఈ కేంద్రాన్ని ఉపయోగించుకోవడం ప్రారంభించారు. రైతు బజార్ ఈవో వరహాలు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం 14 టన్నుల అరటి పండ్లను ఈ చాంబర్‌లో నిల్వ చేశారు. అరటితో పాటు, వివిధ రకాల పండ్లను కూడా నిల్వ చేసి, మగ్గబెట్టడానికి రైతులకు అవకాశం ఉందని ఆయన అన్నారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా, ఇథిలిన్ గ్యాస్ వినియోగించి పండ్లను శీతలీకరించడం, మగ్గబెట్టడం జరుగుతుందన్నారు. ఈ సహజసిద్ధమైన పద్ధతిలో మగ్గబెట్టిన పండ్లను తినడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని స్పష్టం చేశారు.

ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని ఖండించండి



ర్యాలీలో పాల్గొన్న వామపక్ష నాయకులు

పాలస్తీనా సంఘీభావ ర్యాలీలో వామపక్ష పార్టీల పిలుపు

బీచ్‌రోడ్డు: పాలస్తీనా, ఇరాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని ప్రజలు ఖండించాలని, పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో వామపక్ష పార్టీలు ఆర్టీసీ కాంప్లెక్స్ దరి గురజాడ విగ్రహం దగ్గర నుండి ఆశీలమెట్ట మీదుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు యుద్ధం వద్దు.. అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి, పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ ఊచకోతలను ఖండించండని పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గాజాలోని పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ ప్రభుత్వం సాగిస్తున్న ఊచకోతను తీవ్రంగా ఖండించారు. 20 మాసాలకు పైగా ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో 55 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారని గుర్తు చేశారు. వీరిలో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నారని తెలిపారు. ఆస్పత్రులు, పాఠశాలలు, శరణార్థుల కేంద్రాలతో సహా కీలకమైన మౌలిక వసతులన్నింటినీ ఉద్దేశ్యపూర్వకంగా నాశనం చేశారన్నారు. అంతర్జాతీయ జలాల్లో ఫ్రీడమ్ ఫ్లోటిల్లాకు చెందిన మాడ్‌లీన్ ఓడపై ఇజ్రాయెల్ జరిపిన దాడిని కూడా వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. అదుపులోకి తీసుకున్న అంతర్జాతీయ వలంటీర్లందరినీ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో సామ్రాజ్యవాద మనుగడ కోసం అమెరికా అనేక దేశాల మధ్య యుద్ధాలు సృష్టించి ముందుకు సాగాలనుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. భారతదేశం పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించి, ఇజ్రాయెల్‌కు సైనిక, భద్రతా సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలన్నారు. పాలస్తీనీయులపై ఇజ్రాయెల్ మారణకాండ, వివక్ష, ఆక్రమణలకు వ్యతిరేకంగా ప్రజలు నిలబడాలని వామపక్షాలు విజ్ఞప్తి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు హెచ్.ఆర్.ఎఫ్. నాయకులు వి.ఎస్.కృష్ణ, సీపీఎం నాయకులు పి.మణి, బొట్టా ఈశ్వరమ్మ, వి.నరేంద్రకుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె.రెహ్మాన్, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, చంద్రశేఖర్, ఎస్.యు.సి.ఐ.సి. ఎస్.గోవిందరాజులు, ప్రజాపోరు దేవా, నరసింహారావు, వామపక్ష నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో రహదారి



అంధకారంలో కరకచెట్టు పోలమాంబ, మానసిక ఆస్పత్రి రోడ్డు

బీచ్‌రోడ్డు: గిన్నిస్ రికార్డు స్థాయి యోగా వేడుకలకు విశాఖ సిద్ధమవుతున్న వేళ, నగరంలోని ఓ ప్రముఖ రోడ్డు అంధకారం అలుముకోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కరకచెట్టు పోలమాంబ దేవాలయం నుంచి ప్రభుత్వ మానసిక ఆస్పత్రికి వెళ్లే మార్గంలో విద్యుత్ దీపాలు వెలగక స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఈ రోడ్డులో నిత్యం యువతీ యువకులకు ఫొటో షూట్స్, రీల్స్ చేస్తుంటారు. అయితే ఇప్పుడు ఆ రోడ్డు మొత్తం చీకటిమయం కావడంతో బోసిపోయింది. విద్యుత్ దీపాలు వెలగకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి, విద్యుత్ దీపాలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

యోగా దినోత్సవానికి ఏయూ విద్యార్థులు సిద్ధం

మద్దిలపాలెం: ఈ నెల 21న విశాఖపట్నం వేదికగా నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకల్లో పాల్గొనే సువర్ణావకాశం ఆంధ్రా యూనివర్సిటీ అనుబంధ కళాశాలల విద్యార్థులకు లభించింది. ఈ బృహత్తరమైన కార్యక్రమంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యక్షంగా పాల్గొంటుండటంతో ఇది మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. దాదాపు 5 లక్షల మంది ప్రజలతో రామకృష్ణ బీచ్ నుంచి భీమిలి వరకు నిర్వహించనున్న ఈ యోగా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. గత నెల 21 నుంచే 'యోగాంధ్ర' వేడుకల కార్యక్రమాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. నెల రోజుల పాటు సాగుతున్న ఈ యోగాంధ్ర కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ కీలక భాగస్వామిగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే ఏయూ ఉద్యోగులకు సైతం మూడు రోజుల పాటు యోగాపై అవగాహన శిక్షణ తరగతులను నిర్వహించింది.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

జూన్ 21న జరిగే ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన మార్గనిర్దేశం చేసేందుకు ఏయూ అనుబంధ కళాశాలల నుంచి దాదాపు 1200 నుంచి 1500 మంది యువతను సిద్ధం చేస్తున్నారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ ప్రత్యేక శ్రద్ధ వహించి, యోగా దినోత్సవానికి అవసరమైన సేవలు అందించడానికి శిక్షకులను తీర్చిదిద్దారు. ఏయూ అనుబంధ కళాశాలల విద్యార్థులకు ఇప్పటికే రెండు దశల్లో అవసరమైన శిక్షణను అందించారు. తొలి దశలో కార్యక్రమానికి ఎంపిక చేసిన విద్యార్థులకు వారం రోజులపాటు సంబంధిత కళాశాల ప్రాంగణంలోనే ఏయూ యోగా విభాగం విద్యార్థులు, పరిశోధకులు అవసరమైన శిక్షణను అందించారు. రెండో దశలో భాగంగా గత రెండు రోజులుగా కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మరిన్ని మెలకువలు నేర్పించే విధంగా బీచ్ రోడ్డులోని యోగా కేంద్రంలో నిపుణుల పర్యవేక్షణలో తర్ఫీదును అందిస్తున్నారు. ఈ రెండు రోజుల్లో దాదాపు 1200 మందికి పైగా యువత ఈ శిక్షణా తరగతులకు హాజరయ్యారు. ఈ యువకులంతా 21న జరిగే యోగా వేడుకలలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న బ్లాకులలో ప్రజలకు యోగా చేసే సమయంలో అవసరమైన అవగాహన కల్పిస్తారు. ప్రజలు యోగాసనాలు వేసే సమయంలో వారికి అవసరమైన సూచనలు అందిస్తూ, సమన్వయంతో అందరూ నిర్దేశించిన యోగాసనాలను సాధన చేసే దిశగా ఏయూ విద్యార్థులు సమన్వయం చేయనున్నారు. బీచ్ రోడ్డులోని యోగా విలేజ్‌లో రెండు రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు విద్యార్థులు తమ అనుభవాలను, ఆలోచనలను వెల్లడించారు.

ఆరోగ్య విశాఖ లక్ష్యం



యోగాసనాలు వేస్తున్న మేయర్ పీలా తదితరులు

ఎంవీపీకాలనీ: ఆరోగ్య విశాఖ లక్ష్యంగా నగర ప్రజలంతా యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని మేయర్ పీలా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్రలో భాగంగా, జీవీఎంసీ జోన్–3 యంత్రాంగం ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని ఎస్–3 స్పోర్ట్స్ ఎరీనాలో నిర్వహించిన యోగాసనాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజలను యోగా దిశగా నడిపించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. నగర ప్రజలంతా యోగాంధ్రలో పాల్గొని విశాఖ పేరు మీద రికార్డులను సైతం సృష్టించాలని ఆయన కోరారు. అనంతరం, ఆయన యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ గోవిందరాజు, పీవీఎన్ మాధవ్, జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏయూ శతాబ్ది ఉత్సవాలపై చర్చ



పూర్వ విద్యార్థుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది సంవత్సర వేడుకల్లో భాగంగా పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం మంగళవారం ఏయూలో జరిగింది. ఈ సమావేశంలో ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్. ధనుంజయరావు, రెక్టార్ ప్రొఫెసర్ ఎన్. కిషోర్ హాజరయ్యారు. పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జీఎం. రావు, బీవీఎస్. రావు వర్చువల్‌గా హాజరయ్యారు. వారు సంఘం భవిష్యత్తు దృక్పథం, కార్యకలాపాలపై వివరణాత్మక వివరణ ఇచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీ మాజీ ఉపకులపతి బీలా సత్యనారాయణ, ఏఏఏ మాజీ చైర్మన్ గంటా శ్రీనివాసరావు, శంకర్ ఈ సమావేశంలో పాల్గొని విలువైన సలహాలు ఇచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం దార్శనికత, లక్ష్యం, విలువలను అధికారికంగా రూపొందించారు. అలాగే పూర్వ విద్యార్థుల సంఘం కొత్తగా పునరుద్ధరించిన వెబ్‌సైట్‌ను అధికారికంగా ప్రారంభించారు. డిసెంబర్ 2025లో జరగనున్న వార్షిక పూర్వ విద్యార్థుల సమావేశం ప్రణాళిక అమలుపై కూడా చర్చించారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పూర్వ విద్యార్థుల నుంచి ఉత్సాహంగా పాల్గొనేలా అన్ని చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, డీన్స్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, ఏయూ ప్రొఫెసర్లు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

స్టూడెంట్ వెల్ఫేర్ డీన్‌గా హరనాథ్



మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్‌గా సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎస్.హరనాథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు ఆయనను అభినందించారు.

యోగాంధ్రకు సిద్ధమవుతున్న జోడుగుళ్లపాలెం బీచ్‌రోడ్డు

ఆరిలోవ: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న జరగనున్న 'యోగాంధ్ర' కార్యక్రమం కోసం బీచ్ రోడ్డులో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా తెన్నేటి పార్కు, జోడుగుళ్లపాలెం, సీతకొండ సీ వ్యూ పాయింట్ల వద్ద మూడు యోగా పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం బీచ్ రోడ్డుకు ఒకవైపు వాహన రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. నిలిపివేసిన రోడ్డు భాగంలో పచ్చని మ్యాట్‌లను పరిచారు. సీతకొండ వద్ద కొండచరియలు జారి రోడ్డుపై పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. కొండ అంచున ఇనుప రాడ్లతో బారికేడ్‌లను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా, బీచ్‌రోడ్డులో ఒక వైపు రోడ్డును పూర్తిగా మూసివేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.



జోడుగుళ్లపాలెం వద్ద బీచ్‌రోడ్డులో ఒకవైపు వేసిన పచ్చని మ్యాట్



జోడుగుళ్లపాలెం వద్ద ఒక వైపు రోడ్డు మూసేసిన పోలీసులు